# పగటికల

"అమరశ్రీ"

స్కెచ్

అయాచితంగా, అప్రయత్నంగా అనాలోచితంగా... ఒక్కసారి పజిల్‌లో బంపర్ ప్రయిజు వచ్చినంతపనయి... సావకాశంగా దృష్టి సారిస్తే, మరింత ఇదయిపోయి చూస్తూకూర్చుండిపోయాడు. కూర్చున్నాడో, నిలబడ్డాడో ఏం చేస్తున్నాడో తనకే తెలియదు.

ఇదేమి ప్రపంచమని ప్రసాదు తననితాను ప్రశ్నించుకోలేదు. అసలు వ్యవధి ఏదీ? అంతా తబ్బిబ్బయిపోయి, ఉక్కిరిబిక్కిరయి, ఆలోచన తప్పిపోయి చూస్తూ ఊరుకుండటంతప్ప మరేమి చేతకాలేదు. ఏవో వింతవింత ధ్వనులు. అయినా ఎంత ఇంపుగా ఉన్నయ్. పక్షుల కిలకిలలు. అందులో ఎంతమాధుర్యం. వీటన్నిటినీ మించిన అనిర్వచనీయమైన, అయాచిత హృదయానందం. ప్రక్కన ఒక సరస్సు. అందులో పుష్పాలు. కలువలు. వాటిని ఇంకేమంటారో ప్రసాదుకి తెలిసిందికాదు. స్ఫటికంలాంటి నీలిరంగు మబ్బు స్ఫుటంగా సరస్సులో ప్రతిఫలిస్తుంటే చూడటం ప్రసాదుకదే మొదటిసారి.

అంతా అగమ్యగోచరం. చిన్నగా రాగయుక్తమైన పాట. సన్నని జీర. ఊహాతీతమైన శ్రావ్యం. ఏదో గుర్తుకు వస్తున్నట్లయింది. కాని సరిగా గుర్తుకురావటంలేదు. అతను ప్రయత్నించటము అంతకంటేలేదు.

పూర్వజ్ఞానం శూన్యం. పరం అర్థం అనూహ్యం. భవిష్యత్తు అలభ్యం. అదిచీకటికాదు. రాత్రీకాదు. చీకటీ రాత్రీ కలసికూడా లేవు. ఏది ఏది ఏమిటో చెప్పటం ఎలా?

ఇప్పుడిప్పుడే చేతనుడవుతున్నట్లు, అంతా తెలుస్తున్నట్లనిపించింది. ఎంతని సంగ్రహిస్తాడు? ఇదొక అనంతం. తనొక పరమాణువు. ఏదో అర్థంకాని ఆవేదన. ఆలోచన లేనేలేదు.

దూరంగా సన్నటి, మృదువైన, పదధ్వని. అన్ని ధ్వనులలోకి ఈ ధ్వని ప్రత్యేకంగా అతనిలోని ప్రతిఅణువునూ నిద్రనుంచి మేలుకొలిపి ఊగిసలాడించింది. అతనిలో ఉన్న సర్వశక్తులూ ఒక్కొక్కటే యథా స్థానంలోకి రావటం ప్రారంభించటంమూలాన వాతావరణమంతా అతనికి అవగాహనవుతున్నట్లు భావించాడు.

ఏదో కమ్మటివాసన. లావెండర్ పోమేడ్ కాదు. ఏవీకావు. "ఈవెనింగ్ ఇన్‌పారిస్." అదీ కాదు. ఏమిటీసుగంధం? అతనితది పీల్చినకొద్దీ తలతిరిగిపోతున్నట్లనిపించింది. ఎక్కడనుంచి ఈ పరిమళ ప్రళయం?

సరస్సుకి ఆ వైపున, చెట్లకుపైగా, నీలిమబ్బులను అనుకున్నట్లు ...అదిగో...ఆ అమ్మాయే, సందేహంలేదు. ఎప్పుడు ఎక్కడనుంచి, ఎందుకు వచ్చింది? ఎవరికోసం? తనకోసం! ఈ సమాధానం ప్రాణానికి ఎంత హాయినిచ్చింది! తనకోసం! నిజంగా నిజంగా తనకోసం!

వస్తుందా ఇటు? ఎందుకురాదూ. తనకోసం గదూ ఆమెవచ్చిందసలు. తనిక్కడున్నానని ఎలా తెలుసుకుందో? అందమైన ఆడవాళ్ళకి దూరదృష్టి, దూరశ్రవణం...ఇత్యాదులు ఏమన్నా...

ఆమె సమీపిస్తుంది. తనతో మాట్లాడటం... ఆమె పరమావధి. ఆమె జీవితాశ...ఆమె హృదయశాంతికూడాను. తనంటే ఆమెకెందుకీ ఇంత అనురాగం...ఈ ప్రేమానుబంధమూను. తనకు తెలుసా నిజానికి? ఆమెకుమాత్రం తెలుసునని నమ్మకమేమిటి?

తనవైపే చూస్తుంది. తన అందాన్ని, తన ఠీవిని, తనలోని ఆకర్షణాశక్తిని అవలోకిస్తూంది కాబోలు, ఎంత నిశితంగా, వాడిగా ఉన్నదా చూపు. అందుకే అన్నారు విజ్ఞులు స్త్రీ హృదయాన్నిస్తుంది,-చీల్చిచూస్తుందనికూడా.

క్రమేపీ సమీపిస్తుంది. నిజంగా తనకోసం. ఇంకెవరున్నారిక్కడ చెట్లూ చేమలూ తప్ప ఏమి అందం! రంభతో ఎంతమందిని పోలుస్తాం? ఊర్వసిని

మనం చూశామా పోల్చటానికి? సృష్టిలో ఇంత అందం, ఇంత ఆకర్షణ, అమృతత్వం, గొప్పతనం ఉన్నాయని తను అనుకున్నాడా ఇంతకుముందు?

కనీ, వినీ, కంటాననీ, వింటాననీ, అనుకోని, అనుకోజాలని అందచందాల కలయిక. అపూర్వ సమ్మేళనం. అనూహ్యమిశ్రితం. తనకేసి దృష్టి కేంద్రీకరించకపోతే, ఆమెను తను ఇంకా బాగా స్ఫుటంగా చూసేవని.

మేనక, తిలోత్తమలు ఈమెముందు అనవసరం. వాళ్ళ విషయం ఈ నిముషంలో ఇక్కడ అప్రస్తుతం. మార్లిన్ మన్రో ను మరిపించే దేహసౌష్టవం. ఇన్‌గ్రెడ్ బెరుమన్ చూపులు. వాటికీ వీటికీ భేదం లేనేలేదు. లానా టర్నర్ నడక. ఈ నడకలోని ఉద్వేగం తనెన్నడూ చూసినట్లు జ్ఞాపకం లేనేలేదు. షెర్లీ టెంపుల్, బెట్టీ గ్రాబుల్, గ్రెటా గార్బో... ఈమె ముందు ఎంత? ప్రశ్నకే తావులేదసలు.

తన ఆలోచనలో ఆమె రానేవచ్చింది. ఏమి మాట్లాడుతుందో! మొట్టమొదట మాట్లాడటం మంచిదిగాదు, ఎంత ఆదుర్దాగా ఉన్నా కూడా కాస్సేపు నిగ్రహించటం మంచిది. ఏమో... ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు.

ఐనా ఏమని పలకరించడం? తెలుగు భాషలో పదజాలం చాలదు. తన కొచ్చింది ఒక్క ఇంగ్లీషేగా, అదీ సరిగా రాదు. ధైర్యంచేసి మాట్లాడితే, ఆమె తప్పులు పట్టుకుంటేనో? ఇంత ప్రయాస అనవసరం.

అదుగో, ఆమె పెదిమలు కదలబోతున్నయ్ ఆమె మాట్లాడుతుంది గనుక, సంభాషణ ప్రారంభించవలసిన బాధ్యత తనకు లేకుండాపోతుంది. ఏమంటుందో మొట్టమొదట? అసలేమైనా అంటుందీ అసలు?

ఏమిటి అలాగా నిలబడిపోయింది? సుజాతకి మాటలు రాకపోవడం ఏమిటి? తను ఎన్నిసార్లు ఆమె మృదు మధురధ్వని వినలేదు. అయినా తను మోసపోవటంలేదు కదా, తన చూపులతోనే భావాన్ని వ్యక్తే కలిగిస్తుందేమో ఆమె. ఆమె మనోభావాన్ని అవగవపతం కావటానికి ఉపాయం ఏదీ?

ఆమె ముఖంలోకి...ఆమె కళ్లలోకి...కాదు ఆమెలోకే చూడాలి. ప్రసాదు తన చూపులను నిలిపేడు. ఆమె తన వైపేనా చూస్తున్నది? ఏమున్నది తన చుట్టూ? తను ఉన్నది ఏ ప్రపంచము? ఏమిటి తను చూస్తున్నది?

చూడలేక ఒక్కసారి కళ్ళు మూసుకున్నాడు ఏదో వ్యక్తావ్యక్తమైన బాధలోని మధురానుభూతి, ఒక్కసారి కళ్ళు తెరిచాడు.

ఏదీ సుజాత? తన ప్రక్కన సరస్సు ఏమైనట్లు? తన చుట్టూ ఉన్న ఉద్యానవనం కదులుతున్న దేమిటి? తను ప్రపంచంలో కాదు జీవించటం? మళ్ళా కళ్ళు మూసుకున్నాడు.

ఏమిటో నవ్వులు, వికవికలు, పకపకలు, వికటాట్టహాసాలు, "కంగ్రాట్యులేషన్స్"... అన్ని గొంతుకలలోనుంచి ఒకటే మాట. ఎదురుగా అందరూ తన ప్రాణస్నేహితులు హనుమంతరావు, తమీజుద్దీన్, శీతారామయ్య వగైరా వగైరాలు.

"థేంక్స్" అంటూ ప్రసాదు వళ్లు విరుచుకుని కళ్లు తెరిచాడు. వెంటనే గడియారంవంక చూసాడు. పదకొండయింది. సరిగ్గా గంట క్రితమే సుజాతను రోజూలానే తను కాలేజీగేటు వరకూ పంపించి డైరీరాసుని వచ్చేశాడు. వెంటనే డైరీ తెరిచి చూశాడు.

"సుజా ఈరోజు ఎంతో అందంగా ఉన్నది ఎర్రటి జార్జెట్ చీర, 'మేచ్' అయే జాకెట్. కొత్త శాండల్స్. కళ్ళకు కూలింగ్ గ్లాసస్. సుజాతని పలకరించలేక మామూలుగానే గేటు వరకూ కాపలా కాసి వచ్చాను. ఇన్నాళ్ళూ పలకరించకుండా ఉన్నందుకు విచారం మామూలు స్థాయిలోనే వృద్ధిఅవుతూ ఉన్నది!"

డైరీమూసేసి, చిటికవేసి ఆవలించి సిగరెట్ ముట్టించి బజారులోని జనంవైపు చూపునిలిపాడు.